
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 4 జూన్ 2025



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ బడులను మోడల్ స్కూల్స్‌గా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో నూతన జాతీయ విద్యా విధానాలతో పథకాన్ని రూపొందించారు. జిల్లా లో మొదటి విడతలో 40 పాఠశాలలు మంజూరు చేశారు. రెండో విడతలో నాలు గు స్కూళ్లను ఎంపిక చేశారు. ఫేజ్ -1లో 28 ఆటస్థలాలకు రూ.114.50 లక్షలు మంజూరు కాగా పగిడ్యాల మండలం ప్రాతకోట జడ్పీ పాఠశాల మినహా చేపట్టిన ఆటస్థలాలన్నీ పూర్తయ్యాయి. ఫేజ్-2లో 8 ఆటస్థలాలకు రూ.38.25 లక్షలు మంజూరు కాగా మూడు ఆటస్థలాలు మాత్రమే పూర్తయ్యాయి. విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంపొందించేందుకు స్కూళ్లు, కళాశాలల్లో గ్రంథాలయాలు, ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యే
పీఎంశ్రీ లక్ష్యం

మొక్కలకు సేంద్రీయ ఎరువుల తయారీలో విద్యార్థులు(ఫైల్)



- పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి
- నూతన విద్యా విధానంతో ముందుకు
- విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు..
- గ్రంథాలయాలు, ప్రయోగశాలలు ఏర్పాటు
- అధునాతన మరుగుదొడ్ల నిర్మాణం
- జిల్లాలో మొదటి విడతలో 40 పాఠశాలలు
- ఈ ఏడాది మరో నాలుగు పాఠశాలల ఎంపిక

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక ఆటస్థలాలు, క్రీడా పరికరాలు, ల్యాబ్‌లు, సురక్షిత పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తూ విద్యను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో అందించాలన్నదే పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ స్కీమ్) లక్ష్యం. 2022లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో నూతన జాతీయ విద్యావిధానాలతో పథకాన్ని రూపొందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా, ఉద్యోగావకాశాలకు తగిన నైపుణ్యాభివృద్ధికి కల్పించేలా, పర్యావరణ అనుకూల విధానాలు పాటిస్తూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి పీఎంశ్రీ పథకం ఎంతగానో దోహదపడుతోంది. సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. కేంద్రం అందించే ఈ పథకానికి రాష్ట్ర ప్రభు త్వ వాటాగా 40శాతం నిధులను మంజూరు చేయాల్సి ఉం టుంది.

40 పాఠశాలలు ఎంపిక

ఆత్మకూరు మండలం వెంకటాపురం జడ్పీ పాఠశాల, బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట జడ్పీ హైస్కూల్, బండిఆత్మకూరు ఏపీ మోడల్‌స్కూల్, డోన్ ఏపీ మోడల్ స్కూల్, దొర్నిపాడు (జడ్పీహెచ్‌ఎస్), గడివేముల మండలం గడిగరేవుల జడ్పీ హైస్కూల్, కొలిమిగుండ్ల ఏపీ మోడల్‌స్కూల్, కొత్తపల్లె (జడ్పీహెచ్‌ఎస్), మిడ్తూరు ఏపీ మోడల్‌స్కూల్, నందికొట్కూరు మండలం కొణిదెల (జడ్పీహెచ్‌ఎస్), అవుకు ఏపీ మోడల్‌స్కూల్, ప్యాపిలి మండలం హుశ్శేనాపురం (జడ్పీహెచ్‌ఎస్), ఉయ్యాలవాడ ఏపీ మోడల్‌స్కూల్, పగిడ్యాల మండలం ప్రాతకోట (జడ్పీహెచ్ ఎస్), పాములపాడు ఏపీ మోడల్‌స్కూల్ ఎంపికయ్యాయి. పాణ్యం ఏపీ మోడల్‌స్కూల్, రుద్రవరం ఏపీ మోడల్‌స్కూల్, సంజామల మండలం పేరుసోముల జడ్పీస్కూల్, శిరువెళ్ల ఏపీ మోడల్‌స్కూల్, వెలుగోడు ఏపీ మోడల్‌స్కూల్, ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు ఏపీ మోడల్‌స్కూల్, బేతంచెర్ల మండలం రంగాపురం (జడ్పీహెచ్ ఎస్) ఉన్నాయి. చాగలమర్రి జడ్పీ ఓజీ హైస్కూల్, గోస్పాడు ఏపీ మోడల్‌స్కూల్, జూపాడుబంగ్లా ఏపీ మోడల్‌స్కూల్, కోవెలకుంట్ల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, మహానంది మండలం ఎం.తిమ్మాపురం ఏపీ మోడల్‌స్కూల్, నంద్యాల మండలం కొత్తపల్లె జడ్పీ హైస్కూల్‌ను ఎంపిక చేశారు.



వరినాట్లు వేస్తున్న విద్యార్థినులు(ఫైల్)



విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేలా మట్టివిగ్రహాల తయారీ(ఫైల్)

ఆటస్థలాలు : ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి క్రీడల అభివృద్ధికి అవసరమైన మైదానాలను జిల్లాలో 36 మంజూరుచేశారు. ఫేజ్ -1లో 28 ఆటస్థలాలకు రూ.114.50లక్షలు మంజూరు కాగా పగిడ్యాల మండలం ప్రాతకోట జడ్పీ పాఠశాల మినహా చేపట్టిన ఆటస్థలాలన్నీ పూర్తయ్యాయి. ఫేజ్-2లో 8 ఆటస్థలాలకు రూ. 38.25లక్షలు మంజూరు కాగా మూడు ఆటస్థలాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన ఐదు వివిధ దశల్లో ఉన్నాయి.

కిచెన్ గార్డెన్స్: విద్యార్థుల్లో ప్రకృతిపై ప్రేమ పెంచడానికి పాఠశాల ప్రాంగణంలోనే చిన్న తరహా తోటలను ఏర్పాటుచేసి అందులో కూరగాయాలు, పండ్లు, సుగంధద్రవ్యాలు తదితర మొక్కలను పెంచడం లాంటి పనులు చేపట్టారు. కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసేందుకు 27 పాఠశాలలకు రూ.34.29లక్షలు మంజూరు చేశారు. కేటాయించిన వాటిలో ఐదు పాఠశాలలు వెనుకంజలో ఉండగా 22 పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్‌లు ఏర్పాటుచేశారు.

సీడబ్ల్యూఎస్ మరుగుదొడ్లు: బాలికల కోసం నిరంతర నీటి సరఫరాతో కూడిన అధునాతన మరుగుదొడ్లు నిర్మించేందుకు 10 పాఠశాలలను ఎంపిక చేసి రూ.39.05 లక్షల నిధులను మంజూరు చేసింది. ఇందులో 8 మరుగుదొడ్లు పూర్తి కాగా రెండు మధ్యలోనే నిలిచిపోయాయి.

ర్యాంపులు ఏర్పాటు: దివ్యాంగ విద్యార్థులకు, వృద్ధులకు, మెట్లు ఎక్కలేని వారికి అనువుగా ఉండేందుకు ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో గుర్తించిన 22 పాఠశాలలను ఎంపిక చేయగా, వాటికి రూ.11 లక్షలు మంజూరు చేశారు. 22 పూర్తయ్యాయి.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా: విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా గ్రంథాలయాలు, ప్రయోగశాలల ఏర్పాటు కోసం డోన్, కోవెలకుంట్ల, శిరువెళ్ల జడ్పీ హైస్కూళ్లకు 58.92 లక్షలు, ఆళ్లగడ్డ ఏపీఆర్‌డబ్ల్యూఆర్‌ఎస్‌కు లైబ్రరీ, డోన్, నంద్యాల బాలికల పాఠశాలలకు లైబ్రరీలు, శిరువెళ్లలోని జడ్పీ హైస్కూల్ లైబ్రరీకి రూ.78.56లక్షలు మంజూరయ్యాయి.



నిధులు మంజూరు కావాలి : జిల్లాలో నెరవాడ ఏపీఆర్‌ఎస్, ఏపీఆర్‌డబ్ల్యూఎస్ లక్ష్మాపురం, జూపాడుబంగ్లా, ఆళ్లగడ్డ పాఠశాలలకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. గత ఏడాది మంజూరై పూర్తికాని వాటిపై దృష్టిసారించాం.

- ప్రేమంత్‌కుమార్, ఏపీసీ, సమగ్రశిక్ష, నంద్యాల

న్యూస్ బాక్స్

13న జడ్పీస్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు ఈ సమావేశాలు జరుగుతాయని సీఈవో వెల్లడించారు.

నేడు స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ ఆప్షన్లు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్లు అన్ని కేటగిరీల వెబ్ ఆప్షన్లు ప్రారంభమయ్యాయని కర్నూలు జిల్లా డీఈవో ఎస్. శామ్యూల్ పాల్ మంగళవారం తెలిపారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులందరూ వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్లు బుధవారం సాయంత్రం 5 గంటలలోపు పూర్తి చేయాలని ఆయన తెలిపారు.

15 నుంచి సబ్సిడీ విత్తనాలు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ మొదలు నేపథ్యంలో ఈనెల 15వ తేదీ నుంచి సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. వివిధ పంటలకు సంబంధించి 19,027 క్వింటాళ్ల వివిధ రకాల సబ్సిడీ విత్తనాలను రైతులకు అందించేందుకు ఏపీ సీడ్స్ సంస్థ చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె వివరాలను వెల్లడించారు. వేరుశనగ 11,108 క్వింటాళ్లు, కంది 3,442 క్వింటాళ్లు, మినుములు 70 క్వింటాళ్లు, పెసలు 30 క్వింటాళ్లు, కొర్రలు 165 క్వింటాళ్లు, వరి 300 క్వింటాళ్లను రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామన్నారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కర్నూలు జిల్లాకు 10,261 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 8,766 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

ఎలుగుబంటి సంచారం



నల్లమలలో రోడ్డును దాటుతున్న ఎలుగుబంటి

వెలుగోడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు- ఆత్మకూరు రహదారిలోని నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం ఓ ఎలుగుబంటి సంచరించింది. అటుగా ప్రయాణించే కొంతమంది తమ సెల్‌ఫోన్లలో రోడ్డు దాటుతున్న ఎలుగుబంటిని చిత్రీకరించి సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు.

నంద్యాల మార్కెట్ యార్డు పాలక మండలి ఖరారు

- గౌరవాధ్యక్షుడిగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- చైర్మన్‌గా హరిబాబు, వైస్ చైర్మన్‌గా రంగప్రసాద్‌రావు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్ యార్డు కమిటీని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్, చైర్మన్‌గా హరిబాబు, వైస్ చైర్మన్‌గా దియ్యాల రంగప్రసాద్‌రావును ప్రకటించారు. సభ్యులుగా భవనాశి ప్రమీలమ్మ, చింతలనాగకుమార్, దుమావత్ స్వామినాయక్, నంద్యాల విజయగౌరి, గోటికె నాగలక్ష్మి, జిల్లెల్ల అనసూయమ్మ, జమ్మునబోయిన లీలావతి, యర్ర లింగన్నగారి నాగమ్మ, పిట్టల మదార్‌సా, పిచ్చికె సుమలత, పబ్బతి రవికుమార్ ఉంటారు. వీరితో పాటు షేక్‌నూర్‌బాషా, షేక్‌అజ్మీర్, పీఏసీఎస్ కానాల చైర్మన్, నంద్యాల వ్యవసాయ అసిస్టెంట్ డైరక్టర్, మున్సిపల్ చైర్మన్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లు సభ్యులుగా ఉంటారని ప్రకటించారు.

స్థిరంగా పత్తి ధరలు



మార్కెట్‌కు వచ్చిన పత్తి దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,929 పలికింది. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో పత్తి ధరలు రైతులు పెరుగుతాయని రైతులు ఆశించారు. ధరలు పెరగకపోవడంతో పత్తి రైతులు నిరాశ చెందుతున్నారు. కాగా మంగళవారం ఆదోని మార్కెట్‌కు 163 క్వింటాళ్లు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.6,009 గరిష్ఠంగా రూ.7,929, మధ్యస్థంగా రూ.7,620 పలికింది.

నాణ్యతా ప్రమాణాలు
తుంగపాలు

కరువు.. వలసలతో నిత్యం తల్లడిల్లే పశ్చిమ ప్రాంతం పల్లెసీమల జీవనాడి తుంగభద్ర దిగువ కాలువ సీసీ లైనింగ్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తుంగలో కలిపేస్తున్నారు. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. పది కాలాల పాటు అన్నదాతల సేవల్లో తరించాల్సిన ఆధునికీకరణ పనులు రాజకీయ జోక్యంతో ప్రమాణాలు పరిహాసం అవుతు న్నాయి. వైసీపీ హయాంలో 2022-24మధ్య జరిగిన లైనింగ్ పనుల్లో బళ్లారిలో స్థిరప డిన వైసీపీ ముఖ్యనాయకులకు సన్నిహితుడైన ఓకాంట్రాక్టర్ పెత్తనం సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ కాంట్రాక్టరు హవా నడుస్తుందన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించాల్సిన టీబీపీ బోర్డు ఇంజనీర్లు కొం దరు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సీసీ లైనింగ్.. ఛీఛీ లైనింగ్‌గా మారిందనే ఆరోపణలు లేకపోలేదు. ఫేజ్-2 కింద రూ.300కోట్లలో చేపట్టిన ఎల్లెల్సీ లైనింగ్ పనుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి కథనం.

- ఫేజ్-2 కింద రూ.300 కోట్లతో ఎల్లెల్సీ కాలువ లైనింగ్
- ఆధునికీకరణ పనుల్లో నిబంధనలకు తూట్లు
- బలహీనంగా మారిన కాలువ గట్లు
- చక్రం తిప్పుతున్న నాటి కాంట్రాక్టర్
- చోద్యం చూస్తున్న టీబీపీ బోర్డు ఇంజనీర్లు
- నాటి పనులకు కూటమి ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపు



ఎల్లెల్సీ కాలువకు సీసీ లైనింగ్ పనులు

కర్నూలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు తుంగభద్ర డ్యాం నుంచి 24టీఎంసీల వాటా ఉంది, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1,51,413 ఎకరాలకు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ పట్టణాలతో పాటు 195 గ్రామాలకు తాగునీరు అందాల్సి ఉంది. 0/0 నుంచి 241కిలోమీటర్ల వరకు టీబీపీ బోర్డు పర్యవేక్షణలో ఉంది. 70ఏళ్ల క్రితం నిర్మించిన ఎల్లెల్సీ కాలువ గట్లు పలుచోట్ల బలహీనంగా మారడం, పూడికతో నిండిపోవడంతో వాటా జలాలు అందని ద్రాక్షగా మారింది. 2022లో సీసీ లైనింగ్‌కు టీబీపీ బోర్డు శ్రీకారం చుట్టింది. ఫేజ్-1కింద రూ.519.80 కోట్లతో ఆధునికీకరణ పనులు 11ప్యాకేజీలుగా విభజించి చేపట్టారు. బడ్జెట్ కేటాయింపులు లేకున్నా అప్పటి వైసీపీ ముఖ్యనాయకులు ప్రోద్బలంతో పనులు చేపట్టడమే కాకుండా టెండర్లల్లోనే అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బోర్డు క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు నామమాత్రపు తనిఖీలతో సరిపుచ్చి.. మామూళ్లు పుచ్చుకొని అంతా బాగుందని సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలుస్తుంది. వైసీపీ హయాంలో పనులు చేసినా.. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.275కోట్లు బిల్లులు చెల్లించారు. 2023 జనవరిలో రెండోవిడత కింద ఎల్లెల్సీ కాలువ 205కి.మీ నుంచి 250 కిలోమీటర్లు వరకు రూ.300 కోట్లు, హెచ్చెల్సీ పరిధిలో రూ.100కోట్లు కలిపి రూ.400కోట్లతో ఆర్‌సీసీ లైనింగ్ పనులు 13 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వైసీపీ హయాంలో బిల్లులు రావని మొదలు పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని రద్దు చేసి తిరిగి టెండర్లు నిర్వహించాలని బళ్లారికి చెందిన ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నాటి వైసీపీ హయాంలో చక్రం తిప్పిన వైసీపీ రంగు పూసుకున్న కాంట్రాక్టరే.. కూటమి ప్రభుత్వంలో కూడా చక్రం తిప్పి పనులు రద్దు కాకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆపనుల్లో నిబంధనలు తుంగలో కలిపేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనులు పరిశీలిస్తే వాస్తవాలు..


ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తుంగలో కలిపేస్తున్నారు. పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. టీబీపీ ఇంజనీర్లతో పాటుగా నాణ్యత తనిఖీ కోసం థర్డ్ పార్టీకి చెందిన రెండు ప్రైవేటు సంస్థలకు అప్పగించినా ఫలితం శూన్యమే అనిపిస్తుంది. కాంట్రాక్ట్ ఒప్పందం మేరకు కాలువ గట్టు స్లోప్‌ను ఎర్రమట్టితో నింపి గట్టిపడేలా స్లోప్ రోలింగ్ చేయాలి.

(మిగతా 6లో..)

మరో ఇద్దరికి కరోనా..

ఓ డాక్టర్, 25 ఏళ్ల మహిళకు నిర్ధారణ 7

భూమి సత్తువకు పచ్చి రొట్ట 6



ధ్యానముద్రలో కలెక్టర్ రంజిత్ బాషా


ఆరోగ్యయోగం

- రాక్ గార్డెన్స్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు
- రాతి వనాలపై యోగాసనాలు
- వినూత్నంగా ఆలోచించిన అధికారులు

ఓర్వకల్లు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా కర్నూలు జిల్లా అధికార యంత్రాంగం రోజుకో రూపంలో యోగాసనాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. నెల రోజుల పాటు జరిగే ఈయోగాంధ్ర వేడుకలను మంగళవారం సహజసిద్ధంగా ఏర్పడిన రాతివనాలపై నిర్వహించారు. ఓర్వకల్లు మండలంలోని పర్యాటక కేంద్రం రాక్ గార్డెన్స్‌లో సూర్యోదయ వేళ.. కలెక్టర్ రంజిత్‌బాషాతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి కర్నూలు నగరంతోపాటు ఓర్వకల్లు మండలంలోని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఆసనాలు వేశారు. యోగా అభ్యసన విద్యార్థులతో పాటు ట్రైన ర్స్, మాస్టర్ ట్రైనర్స్ వివిధ భంగిమల్లో యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. రాక్ గార్డెన్స్‌లో ఉన్న పెద్ద బండరాళ్లపై వినూత్న రీతిలో యోగాసనాలు వేస్తూ 'యోగాంధ్ర' కీర్తిని చాటి చెప్పారు.


వివరాలు 6లో...

మహానందిలో హైకోర్టు న్యాయమూర్తి



మహానందిలో పూజలు నిర్వహించడానికి వస్తున్న ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మ

మహానంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మ మంగళవారం సందర్శించారు. మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తికి ఆలయ ముఖమండపం వద్ద తహసీల్దార్ రమాదేవి, ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి అభిషేకం, కామేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన, కోదండరామాలయంలో నామార్చన తదితర పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అలంకార మండపంలో న్యాయమూర్తి హరిహరనాథ శర్మను వేదపండితులు ఆలయ మర్యాదలతో సత్కరించి ఆశీర్వదించారు. ఆయన వెంట ఏఈవో యర్రమల్ల మధు, నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.



ఆరోగ్యయోగం

5వ పేజీ తరువాయి

యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పర్యాటక శాఖ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగ్, డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఓర్వకల్లులోని రాక్‌గార్డెన్ వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈకార్యక్రమంలో దాదాపు వేయి మంది యోగా అభ్యాసకులు పాల్గొని యోగాసనాలు చేశారు. వీరికి మాస్టర్ ట్రైనర్లు యోగాసనాలపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య హాజరయ్యారు. యోగాసనాలను వీక్షించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాతివనాల్లోని కొండలపై కూర్చుని తిలకించారు. పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. కొండల్లో యోగాసనాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగా గురువులు మునిస్వామి, విజయకుమార్ ఆధ్వర్యంలో యోగా ప్రొటోకాల్ ప్రకారం దాదాపు గంటపాటు యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల సమైఖ్య గౌరవసలహాదారాలు విజయభారతి, జాయింట్ కలెక్టర్ బి. నవ్య, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, ఏపీ టూరిజం యూనిట్ మేనేజర్ జీవన్, వ్యాఖ్యాత డాక్టర్ మద్దకంటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దినచర్యలో భాగం కావాలి

- రంజిత్ బాషా, కలెక్టర్, కర్నూలు



దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే.. ఇంటిల్లిపాదికి ఆనందం, ఆరోగ్యభాగ్యం సొంతమవుతుంది. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21న నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో కర్నూలు జిల్లాలో 10 లక్షల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. యోగాంధ్రలో భాగంగా ఇప్పటికే ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం గ్రామ స్థాయిలో పోటీ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాల్లో యోగా నిర్వహించాలనే థీమ్‌లో భాగంగా ఓర్వకల్లు రాక్‌గార్డెన్ వద్ద యోగా కార్యక్రమాలు జరుపుకుంటున్నాం. జూన్ 12న కొండారెడ్డి బురుజు వద్ద, 18న మంత్రాలయంలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తాం. 5వేల మంది పారిశుధ్య కార్మికులతో జూన్ 17న కర్నూలులో యోగా కార్యక్రమం నిర్వహించేలా ప్లాన్ చేశాం.

యోగా కోసం సమయాన్ని కేటాయించండి

- గౌరు చరిత, ఎమ్మెల్యే, పాణ్యం



ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని యోగా కోసం కేటాయించండి. యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. యోగా గురించి దేశప్రజలందరికీ తెలియజేస్తూ, అందరినీ యోగాలో భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 'యోగాంధ్ర'కు శ్రీకారం చుట్టారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న వైజాగ్‌లో నిర్వహించనున్న యోగా దినోత్సవం కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరవుతారు.



సూర్య నమస్కారాలు చేస్తున్న జేసీ నవ్య



రాతి వనాల్లో చిన్నారుల యోగాసనాలు

భూమి సత్తువకు పచ్చిరొట్ట

- సేంద్రియ పదార్థాలతో సూక్ష్మధాతువుల వృద్ధి
- జీలుగ, జనుము, పిల్లిపెసర సాగుతో భూమి సారవంతం
- జిల్లాకు 3023 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరు



జీలుగ సాగు

ఆత్మకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ, సహజ సిద్ధమైన పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగిస్తే ఈ విపత్తులు లేకపోగా పంట దిగుబడి బాగా పెరుగుతుంది. పచ్చిరొట్ట ఎరువులు అతితక్కువ ఖర్చులతో తయారు చేసుకోవచ్చునని కూడా వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తొలికరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట విత్తనాలను వేసుకోవాలి. నీటి వసతి ఉన్నట్లయితే వేసవిలోనే సాగుచేసుకోవడం లాభాదాయకం. పసుపు, కంది, చెరుకు వంటి పంటల మధ్య పచ్చిరొట్ట పైర్లను పూతదశలోనే కలియదున్నుకోవాలి.



పచ్చిరొట్ట పైర్లలో 16 రకాలు ఉంటాయి. ఇందులో జీలుగ, అవిశ, జనుము, వెంపల్లి, అలసంద, పిల్లిపెసర, పెసర, మినుము, గోరు చిక్కుడు, అజోల్లా, కానుక, వేప, గ్లెసిడియా, జిల్లేడు, నేల తంగేడు, కొండ మిరుప తదితర రకాలు ఉన్నాయి. వరితో పాటు ఏపంట సాగుచేసినా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు అవసరం. ఇవి పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల పంటకు పుష్కలంగా సమకూర్చుకునే అవకాశం ఉంటుంది.

పచ్చిరొట్ట ఎరువులతో ప్రయోజనాలు



జనుము సాగు

- పచ్చిరొట్ట పైర్లను పొలంలోనే కలియదున్నడం వల్ల సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందుతాయి. భూసారం పెరుగుతోంది.
- భూమిని గుల్లపరిచి నీటినిల్వ సామర్థ్యం అధికం అవుతోంది.
- భూమిలో లభ్యం కాని రూపంలో ఉండే అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి.
- పచ్చిరొట్టతో భాస్వరం, గంధకం లభ్యత చాలా పెరుగుతోంది.

జిల్లాకు 3023 క్వింటాళ్ల సబ్సిడీ జీలుగ విత్తనాలు కేటాయింపు



పచ్చిరొట్ట ఎరువులను నీటిలో మురిగిస్తున్న దృశ్యం

నంద్యాల జిల్లాకు సంబంధించి 27 మండలాలకు ప్రస్తుతం 3023 క్వింటాళ్ల సబ్సిడీ జీలుగ విత్తనాలను కేటాయించినట్లు తెలిసింది. అయితే ఢిల్లీ నుంచి ఈ విత్తనాలను దిగుమతి చేసుకోవాల్సి ఉండటంతో ఇప్పటివరకు కేవలం 1200 క్వింటాళ్లు మాత్రమే జిల్లాకు చేరాయి.

రొట్ట పంటలు సాగు విధానం



జీలుగ పంటను పొలంలో కలియదున్నుతున్న దృశ్యం

జీలుగ పంటను చౌడు, వరి పండించే భూముల్లో సాగు చేసినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయి. ఎకరానికి 20కిలోల విత్తనాలు అవసరమవుతాయి. జనుము సాగుచేసేందుకు ఎకరాకు 9 నుంచి 14కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. దీని ద్వారా ఎకరానికి 5 నుంచి 6టన్నుల పచ్చిరొట్ట లభిస్తోంది. పెసర, మినుము పచ్చిరొట్టతో ఎకరానికి 15 నుంచి 20కిలోల యూరియా లభిస్తోంది. అవిశ పంటకు ఎకరానికి 16కేజీల విత్తనాలు అవసరమవుతాయి. దీని ద్వారా సుమారు 40కేజీల నత్రజని ఉత్పత్తి అవుతుంది. అలసంద సాగుకు ఎకరానికి 15కేజీల విత్తనాలు అవసరం ఉంటాయి. ఈమొక్కలను పొలంలోనే కలియన్నితే 60కేజీల వరకు నత్రజని ఉత్పత్తి అవుతుంది. పిల్లిపెసర ఎకరానికి కేవలం 6కేజీల విత్తనాలు సరిపోతాయి. దీనిద్వారా ఏకంగా 40కేజీల నత్రజని పొలంలో ఉత్పత్తి చేసుకోవచ్చు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి



ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈఏడాది ఖరీఫ్‌కు 350 క్వింటాళ్ల జీలుగ విత్తనాల కేటాయించారు. ఈ వారంలో విత్తనాలు అందుబాటులోకి వస్తాయి. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పట్టాదారు పాస్ బుక్, ఆధార్, ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి.

● ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు


ఆర్‌యూలో 17 నుంచి 'యోగాంధ్ర'

కర్నూలు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు యోగాపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని ఉపకులపతి వి.వెంకట బసవరావు తెలిపారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఆయన చాంబర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యోగాపై పలువురు నిపుణులతో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 21 వరకు యోగాపై కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు పచ్చదనం, పరిశుభ్రతపై ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా విద్యను అభ్యసించాలన్నారు.

డిగ్రీ సర్టిఫికెట్లకు రేపటి నుంచి దరఖాస్తులు

కర్నూలు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉపకులపతి వి.వెంకట బసవరావు తెలిపారు. విద్యార్థులు తగిన రుసుం, అవసరమైన ధ్రువపత్రాలను గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి ప్రస్తుత చిరునామాతో కూడిన కవర్‌ను జత చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రెండు వారాల్లో సర్టిఫికెట్లను పంపిస్తామని తెలిపారు.

క్రీడా పాఠశాలకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎంఎస్‌వీరాజు

నంద్యాల హాస్పిటల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 4, 5తరగతులలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎంఎస్‌వీరాజు అన్నారు. 4, 5 తరగతుల కోసం దరఖాస్తు చేసుకునేవారు 1.4.2015నుంచి 31.3.2017మధ్యలో జన్మించి ఉండాలన్నారు. అలాగే 1వ తరగతినుంచి 3వ తరగతి వరకు ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలో తప్పనిసరిగా పాసై ఉండాలన్నారు. పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ జారీ చేసిన వయసు ధృవీకరణ పత్రం ఉండాలన్నారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 20నుంచి 25వ తేదీవరకు ఆన్‌లైన్‌లో సమర్పించిన అప్లికేషన్స్ స్ర్కీనింగ్, షార్ట్‌లిస్ట్ చేసిన తర్వాత విడుదల చేసిన జాబితా ప్రకారం 1.7.2025నుంచి 3.7.2025వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలకు ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జూలై 10, 11తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపికకు హాజరు కావాలని తెలిపారు.

'సీమ' అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: టీజీ భరత్



పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాయలసీమను అన్నివిధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్ విజయవాడ-కర్నూలు విమాన సర్వీసుల షెడ్యూల్ పోస్టర్‌ను విడుదల చేశారు. జూలై 2న విజయవాడ నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి విమాన సర్వీసులు నడిపేందుకు ఇటీవలే కేంద్ర విమానయాన శాఖ అంగీకరించిందని తెలిపారు. మొదటగా ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఈ విమాన సర్వీసు నడుస్తుందని ఇండిగో ప్రతినిధులు తెలిపారు. విజయవాడలో మధ్యాహ్నం 3.45 గంటలకు బయలు దేరి ఓర్వకల్లుకు 4.50 గంటలకు చేరుకుంటుందని, 5.10 గంటలకు ఓర్వకల్లుఓ బయలు దేరి విజయవాడకు 6.15కు చేరుకుంటుందని, విమాన టికెట్ ధర రూ. 2,533 నుంచి మొదలవుతాయని చెప్పారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాయలసీమలో భారీగా పరిశ్రమలు రానున్నాయని అన్నారు. లేపాక్షి నుంచి కొప్పర్తి, ఓర్వకల్లు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ఎంతో అభివృద్ధి చెందనుందని తెలిపారు. ఈప్రాంతలో డిఫెన్స్ డ్రోన్, ఎలక్ట్రిక్, గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన పరిశ్ర మలు వస్తాయన్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. ఓర్వకల్లు సెమికండక్టర్ల పరిశ్రమ రాబోతుందన్నారు. ఓర్వకల్లు విమాన సర్వీసు ఉండటంతో పారిశ్రామిక వేత్తలు, సీనియర్ ఐఏఎస్ అధికారుల రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. త్వరలో హైకోర్టు బెంచ్ కర్నూల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండిగో విజయవాడ సేల్స్ మేనేజర్ మోహిత్ కృష్ణ, కర్నూలు సేల్స్ మేనేజర్ రవి బాబు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తుంగపాలు



కాలువ గట్టు బలోపేతానికి వాడుతున్న నాణ్యత లేని మట్టి

5వ పేజీ తరువాయి

ఎక్కడ కూడా స్లోప్ రోలింగ్ యంత్రం కనిపించడం లేదు. ఎక్స్‌కవేటర్ (జేసీబీ) బకెట్‌తో స్లోప్ చేసి దానిపై సీసీ లైనింగ్ వేస్తున్నారు.

- అప్రూవ్డ్ క్వారీ నుంచి తెచ్చిన ఎర్రగరుసుతో గట్టు స్లోప్ చేయాల్సి ఉంటే.. కాలువ పక్కనే నల్లరేగడి పొలాలు కొనుగోలు చేసి ఆ మట్టినే తవ్వికాలువకు వాడుతున్నారు.



ఎక్స్‌కవేటర్లతో మట్టి స్లోప్ చేస్తున్న దృశ్యం

- ఇనుము కడ్డీలు(స్టీల్ బార్) మెయిన్‌బార్ (నిలువు) 10 మిల్లీ మీటర్లు, డిస్ట్రిబ్యూషన్ బార్ (అడ్డంగా) 8 మిల్లీ మీటర్లు (ఎం,ఎం) మందం కడ్డీలు వాడాలి. రెండింటికి 8 ఎం.ఎం కడ్డీలే వాడుతున్నారు. అలాగే కడ్డీకడ్డీల మధ్య బాక్స్ నిలువు 25 సెం.మీలు, అడ్డం 25 సెం.మీలు ఉండేలా స్టీల్ కడ్డీలు వాడాల్సి ఉంటే.. 40 సెం.మీలు, 45 సెం.మీలు బాక్స్‌లు కడుతున్నారు.
- ఎం-15 గ్రేడ్ రేషియో ప్రకారం 1:2:4 నిష్పత్తిన సిమెంట్, ఇసుక, కంకర వినియోగించాలి. ఒక క్యూబిక్ మీటరుకు 296 కిలోలు సిమెంట్, 600 కిలోలు ఇసుక, 900 కిలోలు కంకర వాడాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా బల్కేజీ పేరుతో 800-900 కిలోలు ఇసుక, 1,200-1,300 కిలోలు కంకర వాడుతున్నారు. అంతేకాదు.. 4 ఇంచుల మందం సీసీ కాంక్రీట్ వేయాల్సి ఉంటే కొన్ని చోట్ల 3-3.5 ఇంచులే వేస్తున్నారు.
- ఇంజనీరింగ్ అధికారుల సిఫారసులకు విరుద్ధంగా ఆర్‌సీసీ లైనింగ్ పనులు చేస్తూ సిమెంట్, స్టీల్ 25-30 శాతాని కి పైగా పొదుపుగా పాటిస్తున్నారు. మట్టి పనుల్లోనూ ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నారని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న ఇంజనీర్లు గాంధారిపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనల మేరకే పనులు

ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనులు నిబంధనల మేరకే చేస్తున్నాం. బోర్డు ఇంజనీర్లతో పాటు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ బాధ్యతలు చూసే రెండు సంస్థలు కూడా క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తున్నారు. ఏ కాంట్రాక్టరైనా నిబంధనలు విరుద్ధంగా పనులు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

● నారాయణ నాయక్, ఎస్‌ఈ, టీబీపీ బోర్డు, హాస్పెట్

బూర్ల లక్ష్మన్న భళా..!

- అంధత్వాన్ని జయించిన ఉపాధ్యాయుడు
- బ్రెయిలీ లిపిలో భగవద్గీత సారాంశం అనువాదం
- రాధాకృష్ణుల ఆలయ నిర్మాణం



భగవద్గీతను బ్రెయిలీ లిపిలో అనువాదం చేసిన పుస్తకాన్ని చూపుతున్న బూర్ల లక్ష్మన్న

ఆలూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): చూపులేదని దిగులు చెందలేదు. ఆత్మస్థైర్యంతో చీకటిని జయించాడు. విధిని తిట్టుకుంటూ కూర్చోలేదు. విధి రాత అని సరిపెట్టుకో లేదు. పట్టుదలతో శ్రమించి పది మందికి పాఠాలు చెప్పే స్థాయికి ఎదిగారు. కృష్ణుడి ఆలయాన్ని నిర్మించాడు.. బ్రెయిలీ లిపిలో భగవద్గీతను అనువాదించాడు ఉపాధ్యాయుడు లక్ష్మన్న. ఎందరో అంధులకు ఆదర్శంగా నిలిచారు.

అవరోధాలను అధిగమించి ఉపాధ్యాయుడిగా ఎదిగి

ఆలూరు గ్రామానికి చెందిన బూర్ల హనుమప్ప, బూర్ల నరసమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమారుడు బూర్ల లక్ష్మన్న. పుట్టుకతోనే కంటి చూపును కోల్పోయాడు. ఆదిఆంధ్ర పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. తల్లిదండ్రులు ప్రోత్సాహం, ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ వరప్రసాద్ సహకారంతో డా.బీ.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పొందారు. బ్రెయిలీ లిపిలో డీఎడ్ కోర్సు పూర్తిచేసి 1993లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ఎన్నో అవరోధాలు అధిగమించి ఉపాధ్యాయుడి కొలువు సాధించారు. ప్రస్తుతం ఆలూరు మండలంలోని హాలేబీడు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

జానపద సంగీతంలో పట్టు

లక్ష్మన్నకు జానపద సంగీతంలో మంచి పట్టు ఉంది. బుర్రకథలను బాగా చెప్పగలరు. భజన పోటీల్లో న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. అవకాశాలు ఉన్నా చాలా మంది ప్రతిభను వెలికితీసే మార్గాలు ఉన్నా వాటిని వినియోగించుకోలేక పోతున్నారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కాలక్షేపం చేస్తూ తమ ఉన్న తిని తామే తుంచుకుంటున్నారు. నిరుత్సాహంతో కుంగిపోతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా లక్ష్మన్న అవకాశాలు అందిపుచ్చుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి వైకల్యం శరీరానికే గానీ మనస్సుకు కాదని నిరూపించారు.

సమాజం కోసం..

సమాజానికి ఏదైనా చేయాని లక్ష్మన్న సంకల్పించారు. ఈ కోవలోనే ఆలూరు పట్టణం ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఐదు సెంట్ల స్థలంలో దాతల సహకారంతో రాధాకృష్ణుల దేవాలయాన్ని నిర్మించారు. అంతేకాక భగవద్గీత సారాంశాన్ని బ్రెయిలీ లిపిలో అనువదించి బెంగళూరుకు చెందిన మిత్ర జ్యోతి ట్రస్టు ద్వారా ముద్రింపజేశారు. । మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జీవిత చరిత్రను సైతం బ్రెయిలీ లిపిలో రచించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ

ఆత్మస్థైర్యం ఉంటే దేనినైనా సాధించొచ్చు

ప్రతిభకు వైకల్యం అడ్డు కాకూడదు. పట్టుదల ఆత్మస్థైర్యం ఉంటే దేనినైనా సాధించొచ్చు. వైకల్యం ఉన్న వారు నిరుత్సాహ పడకుండా ముందుకు సాగాలి. ఎవరి స్థాయిలో వారు తమకు తోచిన విధంగా సహాయ సహకారాన్ని అందించాలి. ఊపిరి ఉన్నంతవరకు ఇతరులకు సహాయ పడుతా.

● బూర్ల లక్ష్మన్న, ఉపాధ్యాయుడు

ప్రభుత్వ నివాస గృహాల ఆక్రమణపై ఉప లోకాయుక్త ఆగ్రహం

కర్నూలు లీగల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లోని ప్రభుత్వ క్వార్టర్స్‌ను కొంత మంది ఆక్రమించుకోవడంపై రాష్ట్ర ఉపలోకాయుక్త పి.రజని మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు. నగరంలోని పలు ప్రభుత్వ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో కొంతమంది ఆక్రమించుకుని నివసిస్తున్నారు. అంతేగాక వ్యాపారులకు అద్దెకు ఇచ్చి వేలాది రూపాయలు దండుకుంటున్నారని గత నెలలో పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాయి. ఈ కథనాలను జతపరుస్తూ నగరానికి చెందిన కే.జగన్ అనే వ్యక్తి రాష్ట్ర ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. దీనిపై రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజిని స్పందిస్తూ కర్నూలు కలెక్టర్ ఒక కమిటీని వెంటనే ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి సర్వే చేసి అక్రమార్కులను గుర్తించి అద్దెలకు ఇచ్చిన విషయాలను తెలుసుకుని అవసరమైతే కరెంటు, నీటి సరఫరాను కూడా నిలిపివేసి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఈ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుంభకోణాల నుంచి దృష్టి మళ్లించేందుకే..



- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని లెక్కలేనన్ని కుంభకోణాలకు పాల్పడ్డారని అన్నారు. అవి ఒక్కొక్కటిగా ప్రస్తుతం బట్టబయలు అవుతుండటంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు వెన్ను పోటు దినం అంటూ ధర్నాలకు దిగుతున్నారని మండి పడ్డారు. కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేశామని, రాబోయే రోజుల్లో మిగిలినవి విడతల వారీగా అమలు చేస్తామని తెలిపారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

దొర్నిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన సాయికుమార్‌పై అదనపు కట్నం కోసం వేధించిన కేసు నమోదైనట్లు ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. గుండుపాపల గ్రామానికి చెందిన ఏ.శ్వేతకు 2021లో నంద్యాల టౌన్‌కు చెందిన సాయికుమార్‌తో వివాహం జరిగింది. కొద్ది రోజులుగా అదనపు కట్నం తేవాలని భర్త తనను వేధిస్తున్నాడని శ్వేత ఫిర్యాదు చేసిందని ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు దొర్నిపాడు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా..

- ఇద్దరు కార్మికుల మృతి

బనగానపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివర్గం - కొత్తూరు గ్రామాల మధ్య నాపరాయి ట్రాక్టర్ బోల్తా పడడంతో ఇరువురు గని కార్మికులు మంగళవారం మృతి చెందారు. మండలంలోని పలుకూరు గ్రామం నుంచి నాపరాయిని ట్రాక్టర్ ట్రాలీలో నంద్యాల వైపు తరలిస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. పలుకూరు నుంచి నాపరాళ్లతో వెళుతున్న ట్రాక్టర్ నందివర్గం దాటి కొత్తూరు మీదుగా నంద్యాల వైపుకు వెళ్తుండగా నాపరాయి ట్రాక్టర్ అదుపు తప్పి అకస్మాత్తుగా బోల్తా పడడంతో నాపరాళ్ల కింద పడి పలుకూరు గ్రామానికి చెందిన ముక్కమళ్ల శివారెడ్డి(50) అక్కడికక్కడే మృతి చెందాడు. నందవరం గ్రామానికి చెందిన అబ్దుల్‌రసూల్(50)పై నాపరాళ్లు పడడంతో రెండు కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావం అయింది. ఆయనను 108 వాహనంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నందివర్గం పోలీసులు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృత దేహాలను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టానికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత రఘునాథ్ థియేటర్ సమీపంలో నివాసముంటున్న మహ్మద్ ఇలియాస్ (34) అనే వ్యక్తి చెట్టు మీద నుంచి కింద పడి మృతి చెందిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మహ్మద్ ఇలియాస్ సోమవారం తన ఇంటి పరిసరాల్లో ఉన్న నేరెడు చెట్టు ఎక్కి పండ్లను తెంచే క్రమంలో చెట్టు కొమ్మ విరిగి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఆత్మకూరులో ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఇక్కడి వైద్యులు కర్నూలు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మహ్మద్ ఇలియాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చాగలమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గొడిగనూరు గ్రామ సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. మండలంలోని డి.వనిపెంట గ్రామానికి చెందిన శ్రీహరి (23) అనే యువకుడు మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చాగలమర్రి గ్రామంలో ఓ మిల్లులో కూలీ పని చేసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. గొడిగనూరు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయపడ్డ శ్రీహరిని గమనించిన కొందరు వ్యక్తులు చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ, ఏఎస్ఐ ఆస్పత్రికి చేరుకొని ఘటన గురించి ఆరా తీశారు. ఆవాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న శ్రీహరి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ బలవన్మరణం

అవుకు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని రామవరంలో గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సుద్దల శిరీష(26) అనే మహిళ మంగళవారం ఇంట్లో ఉరేసుకుంది. భర్త వెంకటేశ్వర్లు మద్యానికి బానిస కావడంతో మనస్థాపం చెంది ఉరేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

పత్తికొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.అగ్రహారం గ్రామంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. అన్నదమ్ములు రామచంద్ర, లక్ష్మన్న ఇంటి పక్కనే వామిదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు వచ్చి గడ్డిమీద పడటంతో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ప్రయత్నించినా అప్పటికే పశుగ్రాసం బూడిదగా మారింది. రూ.4లక్షల నష్టం వచ్చిందని తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



దగ్ధమవుతున్న గడ్డివాములు

శివారు కాలనీలే టార్గెట్



- పెరిగిపోతున్న చోరీలు
- నిద్రావస్థలో రాత్రి గస్తీ
- స్టేషన్ల మధ్య లోపించిన సమన్వయం
- పనిచేయని సీసీ కెమెరాలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కర్నూలు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దొంగలు పెట్రేగిపోతున్నారు. శివారు కాలనీలే టార్గెట్‌గా రెచ్చిపోతున్నారు. కేవలం సెకండ్ల వ్యవధిలోనే జరిగే దొంగతనాలకు బాధితులు మూగ సాక్ష్యాలుగా మిగులుతున్నారు. రాత్రిళ్లు మానేసి ఏకంగా పట్టపగలే గొలుసు దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. హైదరాబాద్‌లో ప్రతి రోజూ జరిగే దొంగతనాలు కర్నూలుకు పాకాయి. గొలుసు చోరీలను పోలీసులు నియంత్రించలేకపోతున్నారు. చాకచక్యంగా వ్యవహరించలేకపోవడంతో సామాన్యులకు ఆవేదనే మిగులుతుంది. పట్టపగలు దొంగలు చెలరేగిపోతున్నా పోలీసులు సినిమా చూసినట్లు చూస్తున్నారు. ఇళ్లలోకి చొరబడి తుపాకులతో బెదిరించినా.. మాకేమి అన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళనలు కలిగిస్తోంది.

క్షణాల్లో తాళాలు పగలగొట్టి..

ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగల ముఠాలు క్షణాల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల నగరంలో ఓఇంట్లో మనుషులు లోపల ఉన్నా కూడా ఇంట్లోకి చొరబడి నిద్రమత్తులో ఉండగానే చోరీ చేశారంటే వారు దొంగతనం ఎంత చాకచక్యంగా చేశారో అర్థం చేసుకోవచ్చు. ఒకేరోజు గంటల వ్యవధిలో స్నాచింగ్‌లకు, దొంగతనాలకు పాల్పడటం వారి శైలి. ఈముఠాలన్నీ బైక్‌ల నెంబర్ ప్లేట్లు మార్చి బయలు దేరుతారు.

- ఏప్రిల్ 4వ తేదీన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధనలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఆయన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.12లక్షల విలువైన సొత్తును అపహరించారు. (ఏడున్నర తులాల బంగారు, 5.5 లక్షల నగదు, కొంత వెండి నగదు అపహరించారు.)
- ఏప్రిల్ 12న త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పార్థసారధినగర్‌లో నివాసం ఉంటున్న రాంగోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లాడు. అతడి ఇంట్లో ఆరున్నర తులాల బంగారు నగలు, 50 తులాల వెండి నగలు చోరీచేశారు. 14వ తేదీ ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో ఉన్న నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు.

రాత్రి విజన్ స్పష్టంగా..

నగరంలో సీసీ కెమెరాల పనితీరు కూడా అంతంత మాత్రమే. ఇవి కూడా నగరానికే పరిమితమయ్యాయి. గొలుసు దొంగతనాలు ఎక్కువగా శివారు కాలనీలో జరుగుతున్నాయి. ఈ సీసీ కెమెరాల్లో రాత్రి విజన్ స్పష్టంగా కనబడవు. పలు చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం మానేశాయి. ఏదైనా నేరాలు జరిగితే తప్ప సీసీ కెమెరాలు గుర్తుకు రాని పరిస్థితి.

గస్తీ అంతంత మాత్రమే

నగర పరిధిలో ఐదు పోలీసుస్టేషన్లు ఉన్నా జనాభాకు సరిపడా పోలీసులు, తగినన్ని గస్తీ వాహనాలు లేవు. ఏదో నామమాత్రంగా గస్తీ నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రమేనన్న ఆరోపణలున్నాయి. కొత్త సిబ్బందికి తగిన అవగాహన లేకపోవడం. సీసీఎస్ ఆశించినస్థాయిలో పని చేయకపోవడం. పాత నేరస్థులపై కదలికలు పసిగట్టకపోవడం. నగరంలో ఆటో నేరగాళ్లపై నిఘా కొరవడింది.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే..



దొంగతనాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే మంచిది. దొంగతనాలు జరిగాక పోలీసుల చుట్టూ తిరిగే కంటే మన సొమ్మును మనమే జాగ్రత్తగా కాపాడుకుంటే సొమ్ము పదిలం. మెయిన్ డోర్‌కు, ఇంటికి ఉన్న అన్ని బయటిడోర్లకు నాణ్యతా దృడంగా ఉండే సెంటర్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసుకోవాలి. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలి. ఇంటికి తాళం వేసి బయటకు గాని, వేరే ఊర్లకు గాని వెళ్లేటప్పుడు, విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బును ఇంట్లో ఉంచరాదు. ఒకవేళ ఇంట్లో దొంగతనం జరిగినపుడు ఏ వస్తువు కూడా తాకరాదు. బీరువాలను ముట్టరాదు. పోలీసులు వచ్చి వేలిముద్రలు తీసుకున్న తర్వాత ఏదైనా వస్తువులను తాకాలి. ఒకవేళ తాకిన వారు పోలీసులకు వారి వేలి ముద్రలు ఇవ్వాలి

సమన్వయం లేక..

ఒక స్టేషన్ పరిధిలో దొంగతనం జరిగితే మరో స్టేషన్‌వారికి అప్రమత్తం చేసే సమన్వయం ఇక్కడి పోలీసులకు లేదు. ప్రధాన రహదారులపై మాత్రమే తనిఖీలు ఉంటున్నాయి. క్యూఆర్‌టీ, రక్షక్ బైక్‌లు శివారు కాలనీ, వీధుల్లో తిరిగితే కొంత తగ్గే అవకాశం ఉంది. వాహనాల తనిఖీ కూడా తూతూ మంత్రంగానే సాగుతుంది.

పెద్దపులుల సంఖ్య 95

- నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వులో పెరుగుదల
- ఎఫ్‌డీపీటీ బీవీఏ క్రిష్ణమూర్తి



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ బీవీఏ కృష్ణమూర్తి

రుద్రవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వులో పెద్దపులుల సంఖ్య 95కు చేరిందని ఎఫ్‌డీపీటీ బీవీఏ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మొక్కలు పెంచేందుకు నర్సరీ కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌డీఆర్‌లో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఎన్ఎస్‌డీఆర్ నంద్యాల, ఆత్మకూరు, మార్కాపురం, గిద్దలూరు, గుంటూరు జిల్లా పల్నాడు జిల్లాలో విస్తరించి ఉందన్నారు. పెద్దపులుల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు.

రెండు జిల్లాల్లో రూ.4.52 లక్షల మొక్కలు

నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో రూ.4.52 లక్షల మొక్కలను పెంచాలనే లక్ష్యం ఉందని ఆయన అన్నారు. గిద్దలూరులో 1.50 లక్షలు, మార్కా పురంలో 1.50 లక్షలు, ఆత్మకూరులో 50వేలు, నంద్యాల జిల్లా రుద్రవరంలో 1.02 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా ఉందన్నారు. మొక్కలు పెంచి అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా చేయవద్దని ఫారెస్టు అధికారులకు సూచించారు. మొక్కల పెంపకంలో వర్మీకంపోస్టు ఎరువు తప్పకుండా వాడాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసరు రామక్రిష్ణ, మహబూబ్‌ఖాన్, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి

కర్నూల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డిఅన్నారు. కర్నూలు నగర శివారులోని కమ్మ సంఘం భవన్‌లో మంగళవారం ఆర్టీసీ ఎన్ఎంయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రమణారెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ పోరాట ఫలితంగానే కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలను సాధించామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష వైఖరి వల్ల సమస్యలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ చేసి పనిభారం తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశ అనంతరం ఆర్టీసీ ఎన్ఎంయూలో సుదీర్ఘ కాలంగా జిల్లా కార్యదర్శిగా పనిచేసి జిల్లాల్లో ఉద్యోగుల ఆదరాభిమానాలు పొంది పదవీ విరమణ పొందిన సి. మద్దిలేటిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, పీవీ శివారెడ్డి, హరిమోహన్, భాస్కర్‌నాయుడు, సంయుక్త కార్యదర్శి పీఎస్ఎన్ రావు, రాష్ట్ర కార్యదర్శులు భద్రావతి, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

మరో ఇద్దరికి కరోనా..

- ఓ డాక్టర్, 25 ఏళ్ల మహిళకు నిర్ధారణ

కర్నూలు హాస్పిటల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనా మళ్లీ మొదలైంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత 24 గంటల వ్యవధిలో మరో ఇద్దరికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ప్రొఫెసర్‌కు పరీక్షలు నిర్వహించగా.. కొవిడ్ నిర్ధారణ అయింది. నగరంలోని వెంకటరమణకాలనీకి చెందిన ఈ డాక్టర్ హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన 25 ఏళ్ల మహిళ అనారోగ్యంతో వారం రోజుల క్రితం కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. శనివారం మహిళకు కరోనా పరీక్షలు చేయగా.. మంగళవారం మధ్యాహ్నం పాజిటివ్‌గా తేలింది. దీంతో మహిళను వీఐసీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



కొవిడ్ రోగి తిప్పలు

సోమవారం కరోనా నిర్ధారణ అయిన ఎమ్మిగనూరు మండలం కలుగోట్ల రోగిని పాతగైనిక్ విభాగంలోని కొవిడ్ వార్డుకు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం మళ్లీ ఆ రోగిని వీఐపీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించారు. పాత గైనిక్ విభాగంలోని కొవిడ్ వార్డుకు బాత్‌రూంలు లేకపోవడంతో రోగికి తరలించినట్లు సిబ్బంది చెబుతున్నారు. పాత గైనిక్ విభాగంలో కొవిడ్ వార్డు ఆవరణలో ఫిమేల్ మెడికల్ వార్డులు ఉన్నాయి. అక్కడ మహిళా రోగులు ఉన్నచోట కొవిడ్ వార్డును ఎలా ఏర్పాటు చేస్తారని బంధువులు మండిపడుతున్నారు. రెండు రోజులుగా కొవిడ్ రోగిని అటు ఇటు తిప్పుతుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కొవిడ్ వార్డును ఏర్పాటు చేసిన శిథిలమైన గైనిక్ వార్డుల ప్రత్యేకమైన బాత్‌రూమ్‌లు లేకపోవడంతో పక్కన ఉన్న ఫిమేల్ వార్డుల బాత్‌రూంనే వాడుకోవాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యేక కొవిడ్ వార్డును అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.



పాతగైనిక్ విభాగంలో మూతపడ్డ కొవిడ్ వార్డు

భయం వద్దు



కరోనా కొత్త వేరియంట్ పట్ల ప్రజలు భయాందోళనలకు గురి కానవసరం లేదు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న రోగులు సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండాలి. ఆయాసం ఉండి జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వైద్యులను సంప్రదించాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె, కిడ్నీ, క్యాన్సర్, లివర్ వంటి దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారు మాస్కులు ధరించి జాగ్రత్తలు తీసుకోవాలి. కొవిడ్ నియంత్రణకోసం కర్నూలు జీజీహెచ్‌లో పల్మనాలజి హెచ్‌వోడీ డా.శ్రీకాంత్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించాం. పాత గైనిక్ విభాగంలో పది పడకలతో కొవిడ్ వార్డుతోపాటు అవసరమైతే టీబీ వార్డు పక్కన 20పడకలతో ప్రత్యేక కొవిడ్ వార్డును ఏర్పాటు చేయనున్నాం.

- డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్

నది ఒడ్డున శ్మశానానికి రోడ్డు



చెట్నహల్లిలో రస్తాను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



మృతదేహాన్ని తరలించేందుకు గ్రామస్థుల అవస్థలు(ఫైల్)

- సమస్య పరిష్కారం దిశగా చర్యలు
- రూ.45 లక్షలు మంజూరు

మంత్రాలయం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహల్లిలో శ్మశానానికి రోడ్డు సమస్య పరిష్కారం కానుంది. ఇందులో భాగంగా కలెక్టర్ రంజిత్‌బాషా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, తహసీల్దార్ ఎస్.రవి సమస్యను పరిష్కరించేందుకు నది ఒడ్డున శ్మశానానికి రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు. సర్వే.నెంబర్.126లోని 3.54ఎకరాల శ్మశానం రికార్డులో ఉంది. శ్మశాన స్థలానికి, గ్రామానికి 1.5 కిలోమీ టర్ల దూరం ఐదు మీటర్ల వెడల్పుతో రోడ్డు మంజూరుకు నిధులు కేటాయించారు. చెట్నహల్లి గ్రామంలో రూ.45 లక్షలతో రోడ్డు మం జూరు చేశారు. శ్మశాన రోడ్డును పంచాయతీరాజ్ డీఈ రంగ స్వామి, ఏఈ మల్లయ్య, ఇంజ నీరింగ్ అసిస్టెంట్ రంగమ్మ పర్యవేక్షిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే.. నది ఒడ్డున ఉన్న శ్మశాన స్థలానికి అనువుగా ఉండేందుకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే.. ఇరువర్గాలకు మేలని అధికారులు అంచనా వేస్తున్నారు.

నాలుగు నెలల నుంచి..

సర్వేనెంబర్ 113లోని 1.42ఎకరాల్లో రస్తాలో కొన్నేళ్లుగా శ్మశానాన్ని అన్నికులాల వారు ఉపయోగించి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆశ్మశానం పక్కనే దళితులకు ఇళ్ల స్థలాలు కేటాయించగా వారు అక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో శ్మశానంలోని మృతదేహాల పుర్రెలు, కళేబరాలు దళితుల గృహాల ముందు కుక్కలు, పందులు పడేస్తుండటంతో దళితులు అధికారులను ఆశ్రయించి శ్మశానాన్ని మార్చాలని ఆందోళనలు చేపట్టారు. దీనికి బీసీ వర్గాలు అడ్డు చెప్పడంతో నాలుగు నెలల నుంచి బీసీ, ఎస్సీ వర్గాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. దీంతో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రవి, మండల సర్వేయర్ అశోక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్ణయించిన శ్మశానం స్థలాన్ని పరిశీలించి కబ్జాకు గురైన రహదారి, శ్మశాన స్థలాన్ని ఖాళీ చేయించే దిశగా అడుగులు వేస్తున్నారు. దాదాపు 1.5 కిలోమీటర్ల దూరం, 5 మీటర్ల వెడల్పుతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుడుతున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య సమస్య పరిష్కారం కానుంది.

ప్రజా సమస్యలపై పోరాటం: వైసీపీ



మిడుతూరులో మాట్లాడుతున్న సుధీర్

మిడుతూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడతామని వైసీపీ నందికొట్కూరు సమన్వయకర్త ధార సుధీర్ అన్నారు. మిడుతూరులో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్న మల్లారెడ్డి నివాసంలో మంగళవారం మండలంలోని వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుధీర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి పేదలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. నందికొట్కూరులో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం జరగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ లోకేశ్వర రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, శంకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, స్వామి రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రవికుమార్, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల అందజేత

మిడుతూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవోలు రామిరెడ్డి, శ్రీనాథ్ తెలిపారు. మండలంలో 3,793 మంది విద్యారులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయడం కోసం ఆయా పాఠశాలలకు అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందికొట్కూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని నందికొట్కూరు పట్టణ, గ్రామీణ డీలర్లను తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు లబ్ధిదారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ప్రధానంగా 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే సరుకులను తీసుకువెళ్లి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీలర్స్ అసోసియేషన్ నాయకుడు చాంద్, డీలర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నంద్యాల రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ డిమాండ్ చేశారు. పోలూరు గ్రామంలో మంగళవారం ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు. పంటకు గిట్టుబాటు ధరలేక ధాన్యాన్ని ఇళ్లల్లో నిల్వ ఉంచుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. నాయకులు కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంచుకోవాలి

పాములపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంచుకోవాలని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, కేవీకే శాస్త్రవేత్త కృష్ణమూర్తి రైతులకు సూచించారు. మండలంలోని బానకచెర్ల, వేంపెంట, పాములపాడు గ్రామాల్లో మంగళవారం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటసాగులో తక్కువ పెట్టుబడులు వెచ్చించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత, ఏవో ఫణీశ్వరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో ఘర్షణ

మహానంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో వదిలిన పాదరక్షలను కౌంటర్ వద్దకు చేర్చి కాంట్రాక్టర్ డబ్బులు అడగడం ఏమిటని తెలంగాణ రాష్ట్రం అలంపూర్‌కు చెందిన భక్త బృందం మంగళవారం సాయంత్రం ఆలయ పాదరక్షల భద్రత కౌంటర్ వద్ద ఘర్షణ జరిగింది. అలంపూరుకు చెందిన భక్తులు మహానందికి దర్శనం కోసం వచ్చారు. ఆలయంలోకి వెళ్లే క్రమంలో పరిసరాల్లోని ఒక మూలకు తమ పాదరక్షలను భక్తులు వదిలారు. దర్శనం చేసుకొని బయటకు వచ్చిన భక్తులకు తమ పాదరక్షలు మాయం కావడంతో కంగుతిన్నారు. చుట్టు ప్రక్కల భక్తులను విచారించగా మీ పాదరక్షలు భద్రపరిచే కౌంటర్‌కు చేరాయని చెప్పడంతో అక్కడికి వెళ్లారు. తమ పాదరక్షలను తీసుకొని రావడానికి మీరెవరు? డబ్బులు ఇచ్చే ప్రసక్తి లేదని అన్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్‌కు భక్తుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. రూ. లక్షలు వేసి టెండర్ వేశామని, డబ్బులు చెల్లించాలని డిమాండ్ చెయ్యడంతో భక్తులకు, కాంట్రాక్టర్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ వ్యవహారం చివరికి పోలీస్ స్టేషన్ చేరింది. అక్కడ ఇరువురికి పోలీసులు కౌన్సెలింగ్ వ్యవహారాన్ని సద్దుమణిగించినట్లు సమాచారం.

'రాష్ట్రంలో ప్రజా రంజక పాలన'

నంద్యాల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో ప్రజా రంజక పాలన సాగుతోందని పట్టణంలోని టీడీపీ 38వ వార్డు ఇన్‌చార్జి బుగ్గరాముడు అన్నారు. మంగళవారం వృద్ధులు, విద్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అక్రమాలను అరికట్టడానికి చౌక దుకాణాల ద్వారానే సరుకులు పంపిణీ చేయడాన్ని పునఃప్రాంభించారని అన్నారు. కార్యక్రమంలో మహేష్, చిన్నరాముడు, రత్నంశెట్టి, రమణ, ధనుంజయుడు పాల్గొన్నారు.

'వెలాసిటి' విద్యార్థిని ప్రతిభ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వెలాసిటి కళాశాల విద్యార్థిని పగిడాల కీర్తి 3225 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మాధవీలత మాట్లాడుతూ కళాశాల స్థాపించిన అతి తక్కువ కాలంలోనే ప్రణాళికబద్ధతతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్లనే గొప్ప ఫలితాలను సాధించామన్నారు. అనంతరం విజయానికి కారకులైన అధ్యాపకులను, విద్యార్థిని, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.

ఆదరణ కరువు

- ఆదాయం తప్ప అభివృద్ధిని మరిచిన అధికారులు
- దర్శనమిస్తున్న చెత్తదిబ్బలు
- ఏటేటా నిర్వీర్యమవుతున్న సంతమార్కెట్ నిర్వహణ



నిరుపయోగంగా రేకుల షెడ్లు



ప్రధాన ద్వారాలకు గేట్లు లేని దృశ్యం



ఆదివారం రోజున అరకొర సదుపాయాల నడుమ కొనసాగుతున్న సంత



మిగతా రోజుల్లో దుస్థితి ఇలా..

ఆత్మకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వ్యాపారాలతో కళకళలాడిన ఆత్మకూరు సంతమార్కెట్‌కు గత కొన్నేళ్లుగా ఆదరణ కరువవుతోంది. ప్రతిఆదివారం ఇక్కడ జరిగే వారంతపు సంతతో పాటు ప్రతిరోజు జరిగే దినసరి మార్కెట్‌కు కూడా ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఆత్మకూరు పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ వారాంతపు సంతకు తరలివచ్చి కూరగాయలు, ఇతర నిత్యావసరాలను ఇక్కడే కొనుగోలు చేసేవారు. దీంతో అప్పట్లో సంతమార్కెట్ ప్రాంగణంతో పాటు చుట్టు పక్కల ప్రదేశాల్లో కూడా వందల సంఖ్యలో దుకాణాలు వెలిసి ప్రజలతో కళకళలాడేది. అలాంటి నేడు ఆత్మకూరు సంతమార్కెట్ ఆదరణను కోల్పోతోంది. దీనికి గల ప్రధాన కారణం సంతమార్కెట్ నిర్వహణ గాడితప్పడమేనన్న విమర్శలు ఉన్నాయి. కేవలం ఆదివారం జరిగే సంతమార్కెట్‌ను పురస్కరించుకుని శనివారం మాత్రమే సంతమార్కెట్‌ను శుభ్రపరుస్నారే తప్ప మిగతా రోజుల్లో నిర్వహణను సంబంధిత మున్సిపల్‌శాఖ పట్టించుకోవడం లేదు. ఏటా సంతమార్కెట్ వేలాల రూపంలో లక్షల రూపాయల ఆదాయాన్ని అర్జిస్తున్న మున్సిపల్‌శాఖ అధికారులు అదేస్థాయిలో సంత మార్కెట్‌ను తీర్చిదిద్దడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రత్యేకించి సంతమార్కెట్‌లో ఏర్పాటు చేసిన షెడ్లన్నీ శిథిలావస్థకు చేరాయి. దీంతో వర్షాకాలంలో నీరుకారుతూ అసౌకర్యానికి గురిచేస్తోంది. అదేవిధంగా అనేక షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా మాంస విక్రయాల కోసం కేటాయించిన ప్రదేశం అపరిశుభ్రంగా తయారై అక్కడ ఎలాంటి దుకాణాలను ఏర్పాటు చేయలేదని పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే సంతమార్కెట్‌కు ఉన్న మూడు ప్రధాన ద్వారాలకు తలుపులు లేకపోవడం వల్ల పశువులు సంతలోకి ప్రవేశించి వీరంగం సృష్టిస్తున్నాయి. వీటికితోడు ప్రతిరోజు జరిగే మార్కెట్ సందర్భంగా వచ్చే వ్యర్థాలే కాకుండా చుట్టుపక్కల వారు సంతమార్కెట్‌లో చెత్తాచెదారాన్ని వేయడం వల్ల సంతమార్కెట్ అధ్వానంగా తయారవ్వడంతో ప్రదేశంలో కూరగాయాలు, ఇతర నిత్యావసర సరుకులను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. అదేవిధంగా మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు కూడా ఎలాంటి సదుపాయాలను ఏర్పాటు చేయలేదు. దీంతో అమ్మకాలు క్షీణించి వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా.. సంబంధిత మున్సిపాలిటీ అధికారులు స్పందించి సంతమార్కెట్‌లో శిథిలావస్థకు చేరుకున్న షెడ్డులను బాగుపర్చడంతో పలు పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంతమార్కెట్ నిర్వహణను మెరుగుపరుస్తాం



సంతమార్కెట్ నిర్వహణను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా సంత మార్కెట్‌లో దుకాణాలను నిర్వహించే వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే.. వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటాం. వినియోగదారులకు ఎలాంటి ఆటం కాలు తలెత్తకుండా శ్రద్ధ వహిస్తాం.

- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో స్వశక్తితో రాణించాలి అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. వెలుగోడులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంబించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలో మొదటి విడతగా 500 కుట్టు మిషన్లు వచ్చాయని మహిళలు కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకొని ఆదాయం మమకూర్చుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, మోమిన్ రసూల్, వీరభద్రుడు, ఖలీల్, కృష్ణుడు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తన స్వగ్రామం వేల్పనూరులో 24 మంది లబ్ధిదారులకు రూ.16,45,960 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

'వెన్నుపోటుకు మారుపేరు జగన్'

ఆత్మకూరు: ప్రజలను అన్ని విధాలుగా వెన్నుపోటు పొడిచిన వ్యక్తి మాజీ సీఎం జగనేనని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తి పొందిన రోజు జూన్ 4వ తేది అని అన్నారు. నరకాసుడి పాలన నుంచి ఓటు రూపంలో ప్రజలు విముక్తి పొందారని అన్నారు. మద్యపాన నిషేదం వంటి బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ తర్వాత మద్యంతోనే ఆ పార్టీ నాయకులు వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డారని అన్నారు. కల్తీ మద్యంతో 30వేల ప్రాణాలను బలికొని అక్కాచెల్లెమ్మల పసుపు కుంకుమలను దూరం చేశారని దుయ్యబట్టారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి యువతను నట్టేట ముంచారన్నారు. పింఛన్లను పెంచుతామని చెప్పి చేసిన మోసమేంటో అందరికీ తెలుసన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తామని చెప్పి ఆతర్వాత వెన్నుపోటు పొడిచింది ఎవరో గుర్తించుకోవాలని సూచించారు. ల్యాండ్, ఇసుక, మైనింగ్, మద్యం స్కామ్‌ల నుంచి ప్రజల్ని దృష్టి మళ్లించేలా వైసీపీ నేతలు వెన్నుపోటు డ్రామాలు ఆడుతున్నారన్నారు. ప్రజాక్షేత్రంలో చచ్చిన పార్టీని బతికించుకోవ డానికి జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. వెన్నుపోటు దినానికి బదులు గొడ్డలిపోటు దినం, తల్లి, చెల్లిని గెంటేసిన దినాలను చేసుకోవాలని సూచించారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహానంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మహానంది సమీపంలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి సామేలు అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ప్రభుత్వ భూముల్లో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ ఈ ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పేదవాడికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. మండలంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను భూస్వాములు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆక్రమణదారులపై తహసీల్దార్ చర్యలు తీసుకోకపోతే ఆ భూముల్లో ఎర్రజెండాలను ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొని డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో

పాణ్యం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కుక్ కం హెల్పర్స్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలలో ఎలా వంట నిర్వహించాలో వివరించారు. అనంతరం కార్మికులకు వంటల పోటీలు నిర్వహించారు. మెనూ ప్రకారం ఆరు రోజులు వంటలను కార్మికులు పోటీలలో ప్రదర్శించారు. అపంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో సుబ్రహ్మణ్యం, హెచ్ఎంలు విజయలక్ష్మి, జిలానీ బాషా, పంచాయతీ కార్యదర్శులు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో కరెంట్ బిల్లులు చెల్లించొచ్చు

నంద్యాల కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా విద్యుత్ వినియోగాదారులందరు ఈ నెల నుంచి కరెంటు బిల్లులు కొత్తగా బిల్లులో వున్న క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ రమేష్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ ఇంటివద్ద నుంచే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ విద్యుత్ బిల్లులను ఫోన్‌పే, గూగూల్ పే ద్వారా బిల్లులు చెల్లించవచ్చునని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

భూమి ఆరోగ్యంగా ఉంటేనే మంచి దిగుబడులు

నంద్యాల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూమి ఆరోగ్యంగా ఉంటేనే మేలైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాలలో మంగళవారం బనగానపల్లె మండలం యాగంటిపల్లె కేవీకే కోఆర్డినేటర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తుండడంతో వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పెసర, మినుమును సాగు చేసుకోవాలని సూచించారు. వీటిని భూమిలో కలియదున్నడం వల్ల కర్బన శాతం పెరిగి నేల సారవవతం అవుతుందన్నారు. పొలం గట్లపై కంది, కూరగాయలు సాగు చేసుకోవడం వల్ల అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు. అనంతరం కేవీకే కోఆర్డినేటర్ ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకుని అనుగుణంగా ఎరువులు వాడడం వల్ల మంచి ఫలితాలు పొందుతారన్నారు. విచక్షణారహితంగా మందులు వాడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సాగుకు అనువైన వరి రకాలలో ఎన్‌డీఎల్ఆర్- 7, ఆర్ఎన్ఆర్-15048 అనువైనవిగా వివరించారు. రైతులకు అధిక ఆదాయం ఇచ్చే పండ్లు, కూరగాయల తోటలు సాగు చేయాలని సాగుకు ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. శాస్త్రవేత్తలు సుధాకర్, సుగన్న, హఫీజ్‌పర్వీన్, నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, ఏవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న డీఏవో మురళీకృష్ణ

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు



అమ్మవారిని దర్శించుకుంటున్న శివానందరెడ్డి తదితరులు

పాములపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణానగర్ గ్రామంలో మంగళవారం సుంకులా పరమేశ్వరీదేవిని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూర్ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్ర రెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, పూసలక్రిష్ణ, రాముచౌదరి, ఆదిరెడ్డి, గట్టు లింగేశ్‌గౌడ్, నాగర్జునరెడ్డి, మల్లీశ్వరరెడ్డి, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం



పుణ్యాహవాచనంలో పాల్గొన్న దంపతులు

మిడుతూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం గోపూజ, గణపతి పూజలతో ప్రారంభం అయ్యాయి. అనంతరం పుణ్యాహవాచనం, మాతృకా పూజ, పంచగవ్య మేళనం, యాగశాల ప్రవేశం, ద్వార పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం ప్రదోశ పూజ, దీక్షా హోమం, జలాదివాసం కార్యక్రమాలు వేద పండితుల మధ్య వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి బట్వారిపల్లెలో..

కొత్తపల్లి: మండలంలోని బట్వారిపల్లె గ్రామంలో బుధవారం నుంచి 6వ తేదీ వరకు సుంకులా పరమేశ్వరి, పోతురాజు సహిత నాభిశిల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ భక్తబృందం తెలిపింది. బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, యంత్ర పూజ, ప్రతిష్ఠ, శాంతి హోమం, జలాధివాసం, 5వ తేదీ ఉదయం అభిషేకాలు, దీక్షా హోమం, గ్రామోత్సవం, ధాన్యాదివాసం, 6వ తేదీ విగ్రహ, యంత్రాలకు అభిషేకం, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, దేవతా హోమం, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రామ కమిటీ పేర్కొంది. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

కుమారస్వామికి విశేష పూజలు

నంద్యాల కల్చరల్ (శ్రీశైలం), జూన్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయాన్నే మహాగణపతి పూజ, అనంతరం దేవస్థానం సేవగా స్వామికి పంచామృత అభిషేకం, వివిధ రకాలైన పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు.

నందీశ్వర స్వామికి..

శ్రీశైలక్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో లోని నందీశ్వరస్వామికి మంగళవారం విశేష అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలోభాగంగా అర్చకస్వాములచే నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోను, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోతకం, భోస్మదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, శుద్ధజలంచే అభిషేకాలు నిర్వహించారు. చివరగా నందీశ్వరునికి నానబెట్టిన శనగలను స్వామివారికి సమర్పించారు.

- ఆలయంలోని బయలు వీరభద్రస్వామికి విశేషపూజలు: శ్రీశైలంలోని సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన బయలు వీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

6న మాన్యం కౌలు వేలం

పాణ్యం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాణ్యం దేవదాయశాఖకు చెందిన భూములు కౌలు వేలం ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈవో సువర్ణ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రామస్వామి, వీరనారాయణస్వామి, పాణికేశ్వరస్వామి, పడ వెంకటాద్రి, సత్యనారాయణ స్వామి దేవసానాఆలకు చెందిన భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటదారులు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు వేలం పాటలు జరుగుతాయని చెప్పారు.

12న విష్ణునందీశ్వర స్వామి ఆలయ భూములు

బండిఆత్మకూరు: నవనందుల్లో ఒకటైన విష్ణునందీశ్వర స్వామి ఆలయ భూముల వేలం ఈ నెల 12వ తేదీన నిరవహిస్తు న్నట్లు ఈవో జి.వేణునాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆలయానికి చెందిన సుమారు 14 ఎకరాలకు 12వ తేదీ ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల రైతులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. వేలం పాట పూర్తి అయిన వెంటనే పూర్తి మొత్తాన్ని వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో సదరు వేలం పాట రద్దు పరచి తిరిగి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ప్రజా తీర్పును వెన్నుపోటుగా ప్రకటించడం దారుణం'

నందికొట్కూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన తీర్పును వెన్నుపోటుగా ప్రకటించడం దారుణమని, ఇది జగన్‌మోహన్‌రెడ్డి రాక్షసత్వానికి నిదర్శనంగా నిలుస్తోందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజును వెన్నుపోటు దినంగా వైసీపీ ప్రకటించడం బాధాకరమన్నారు.జగన్‌రెడ్డి విధ్వంసకర పాలనతో విసిగిపోయిన ప్రజలు విముక్తి పొందిన రోజు జూన్ 4 అని అన్నారు. నిజానికి నరకాసుర పాలన నుంచి విముక్తి పొందిన రోజుగా ఈ రోజున రాష్ట్ర ప్రజలంతా దీపావళి జరుపుకోవాలన్నారు. వైసీపీ నాయకులకు ప్రజా తీర్పు వెనుపోటులా కనిపిస్తోందంటే ప్రజాస్వామ్యం పట్ల వైసీపీకి ఎంత గౌరవం ఉందో స్పష్టమవుతోందన్నారు. మద్యపాన నిషేధం అనే బూటకపు హామతో అధికారంలోకి వచ్చి కల్తీ మద్యంతో 30 వేల మంది అక్కాచెల్లెమ్మలకు పసుపు-కుంకుమ దూరం చేసి వెన్నుపోటు పొడిచింది మీరు కాదా అని ఆయన ప్రశ్నించారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను మోసం చేసి వెన్నుపోటు పొడిచింది మీరు కాదా? అని ప్రశ్నించారు. ల్యాండ్, ఇసుక, మైనింగ్, మద్యం, స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి, ప్రజాహితంగా సాగుతున్న కూటమి పాలనను చూసి ఓర్చుకోలేక నిత్యం ఏదో ఒక డ్రామాతో, డ్రామా ఆర్టిస్టులతో ప్రజా క్షేత్రంలో చచ్చిపోయిన పార్టీని బతికించుకోవడానికి జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు ఛీకొట్టినా వైసీపీ అధినేతకు, నాయకులకు బుద్ధి రావడం లేదన్నారు. గొడ్డలి పోటు దినం, సొంత తల్లి- చెల్లిని ఇంటి నుంచి గెంటేసిన దినం, అమ్మ మీద కేసు పెట్టిన దినం ఎప్పుడు జరుపుకుంటారో కూడా వైసీపీ నాయకులు ప్రజలకు చెప్పాలని మాండ్ర శివానందరెడ్డి సూచించారు.

15 మంది బైండోవర్

మహానంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా మండలంలోని 15 మంది రౌడీ షీటర్లపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సాగుకు సమాయత్తం

- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ బిజీ



పొలం పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు

బనగానపల్లె/కొలిమిగుండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు కోటి ఆశలతో ఖరీఫ్‌సాగుకు సమాయత్తమవుతున్నారు. మే నెలలోనే ముందస్తు వర్షాలు కురువడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో దుక్కులు దున్నుతున్నారు. అలాగే గడ్డి, ఆకుమట్టలు తొలగించడానికి సేద్యాలు చేస్తున్నారు. గత సంవత్సరం ప్రకృతి అనుకూలించినా పంటలు బాగా పండినా ధరలు లేకపోవడంతో అన్నదాతలు నష్టపోయారు. ఈ ఏడాది వ్యవసాయం అనుకూలిస్తుందని కోటి ఆశలతో అన్నదాతలు ఖరీఫ్ పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారు.

38,600 హెక్టార్లలో ఖరీఫ్ సాగు

బనగానపల్లె, కోవెలకుంట్ల సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 38,600 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా ఈ ఖరీఫ్‌లో మండలంలో 38,600 వేల హెక్టార్లలో సాగు చేయడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. బనగానపల్లె మండలంలో 12వేల హెక్టార్లలో, కోవెలకుంట్ల సబ్ డివి జన్‌లో 26,600 హెకార్లలో పంటలు సాగుచేసేందుకు రైతులు సమాయాత్తమవుతున్నారు.

11న ఏరువాక పౌర్ణమి

ఈనెల 11న ఏరువాక పౌర్ణిమ అనంతరం జిల్లాలో ఖరీఫ్ సాగు మరింత ఊపందుకోనుంది. మరోవైపు రైతన్నలకు కలిసొచ్చే మృగశిర నక్షత్రం అదే సమయంలో రానుండటంతో అన్నదాతలు తమ సాగును ప్రారంభించడానికి ఆసక్తిని చూపుతున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వరుణదేవుడు కరుణించి, పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తుండటం అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

ఎరువులు, విత్తనాలు కోసం..

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో ఎరువులు, విత్తనాలు, పెట్టుబడుల కోసం రైతులు బిజీబిజీగా ఉన్నారు. పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి ఇప్పటికే అన్ని మండలాలకు జీలుగ విత్తనాలు సబ్సిడీపై మంజూరయ్యాయి. వీటికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. అలాగే రాయితీ విత్తనాలు కందులు, మినుము విత్తనాలు మంజూరు కావాల్సి ఉంది. రైతులకు అవసరమైన రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అవసరాలను బట్టి ఎరువులు తెప్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. జూన్ 15లోగా రాయితీ విత్తనాలు అందుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో బనగానపల్లె, కోవెలకుంట్ల సబ్ డివిజన్ పరిధిలో ప్రధానంగా ప్రత్తి, మొక్కజొన్న, వరి, కొర్ర, కంది పంటలు సాగుచేయడానికి సమాయాత్తమతున్నారు.

సకాలంలో రుణాలు అందించాలి

ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు సకాలంలో బ్యాంకులు పంట రుణాలు అందించాలని రైతులు కోరుతున్నారు. దుక్కులు చేయాలంటే విత్తనం, ఎరువులు, మందులు కొనుగోలు చేసేందుకు కూలీల ఖర్చుల కోసం డబ్బులు రైతులకు అవసరం. బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. సకాలంలో బ్యాంకులు రుణాలు ఇస్తే సరి. లేకుంటే ప్రైవేటు వ్యక్తులను రైతులు ఆశ్రయించాల్సి ఉంటుంది. బ్యాంకు అధికారులు రుణాలు రైతులకు అందించాలంటే ఇతర బ్యాంకుల్లో బకాయిలు లేన్నట్లుగా ధృవీకరణ పత్రాలు తేవాలని ఇబ్బందులు పెడుతున్నారు. అడిగిన వెంటనే రుణాలు ఇచ్చేలా బ్యాంకులు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

జూన్‌లోనే అందనున్న అన్నదాత సుఖీభవ

కూటమి ప్రభుత్వం హామీల్లో కీలకమైన అన్నదాత సుఖీభవ జూన్ మాసంలోనే రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ రూ.6000లకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14000అందించి రైతులను ఆదుకోనున్నారు.

భూసార ఆధారిత యాజమాన్యం పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త బాలరాజు

శిరివెళ్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : రైతులు భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోవిందపల్లె, చెన్నూరు గ్రామాల్లో మంగళవారం రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఖరీఫ్ ముందు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఐఎం ఆర్ శాస్త్రవేత్త శ్రీనివాస్, డీడీఏ చెన్నయ్య, మండల వ్యవసాయాధికారి సుధాకర్, జిల్లా వనరుల శాఖ ఏవో ప్రభావతమ్మ, ఉద్యానశాఖ అధికారి దివ్య, ఆత్మ ఏటీఎం హరిబాబు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్యాపిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రాహుల్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి: మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అంజలి సూచించారు. మంగళవారం ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు కలిసి మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఎస్ రామలింగారెడ్డి, ఎంపీహెచ్ ఈవో వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

11న యాగంటిపల్లెలో పెద్దమ్మ జాతర

బనగానపల్లె, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో ఈనెల 11న పెద్దమ్మ జాతర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, రైతుసంఘం నాయకులు మంగళవారం తెలిపారు. 40 ఏళ్ల తర్వాత జాతరను పెద్ద ఎత్తున నిర్వహించడానికి కలిసికట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్థులు జాతరకు సంబంధించి ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

అవినీతిపై విచారణ

బనగానపల్లె, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆడుతాం ఆంధ్ర క్రీడాపోటీల్లో జరిగిన అవినీతిపై బనగానపల్లె పట్టణంలో విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. మండలంలోని 25 గ్రామ సచివాలయాలకు గతంలో నిధులు మంజూరు చేశారు. ఈ నిధులు ఏఏ వాటికి ఖర్చు చేశారన్న విషయంపై పూర్తి స్థాయిలో గ్రామ సచివాలయ కార్యదర్శులను విజిలెన్సు అధికారి మల్లీశ్వరమ్మ విచారించారు. ఫార్మట్ రూపంలో వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆమె తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలి

కొలిమిగుండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కొలిమిగుండ్ల తహసీల్దార్ కారార్యాలయం ముందు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. నాయకులు సూర్యనారాయణ,మహేష్, లక్ష్మీదేవి, రాజు, నాగేంద్ర కంబగిరిస్వామి పాల్గొన్నారు.

బేతంచెర్ల: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం వినతి పత్రాన్ని డీటీ మారుతికి అందజేశారు. నాయకులు సోమన్న, శ్రీరాములు, విజయ్, ఎల్లకృష్ణ, ఉదయ్, మధు, ప్రదీప్, భాస్కర్, శివ, ఫారూక్, మహేష్, రాజారమేష్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే టీడీపీ ధ్యేయం

బేతంచెర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళల అభివృద్ధి, వారి జీవనోపాధే ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహిస్తున్న మహిళల ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుట్టు శిక్షణ కేంద్రం శిక్షకురాలు, మహిళలు పాల్గొన్నారు.

ముచ్చులపురిలో విగ్రహాల ప్రతిష్ఠ

సంజామల,జూన్ 3(ఆంధ్రజ్యోతి): ముచ్చలపురి గ్రామంలో విగ్రహాల ప్రతిష్ఠ పూజలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దలు అమీర్ దొర, ఈర్ల చిన్న రాముడు, కొర్రపాటి పెద్దిరెడ్డి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శివాలయంలో గణపతి, గౌరీ దేవి, సుబ్రమణేశ్వర స్వామి, రాములమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు గ్రామంలో ఉత్సవాలు జరగనున్నాయి. గురువారం విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

రుద్రవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు విన్నవించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు మల్లిఖార్జున అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలను ఆదేశించారు. అలాగే గృహాలు నిర్మించుకుంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయాలని అన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

చాగలమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన రహదారులు, మురికి కాలువలు, కల్వర్టు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా క్వాలిటీ కంట్రోలర్ డీఈ మోహన్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని డి.వనిపెంట, డి.కొత్తపల్లె, గొడిగనూరు గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, మురికి కాలువ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ఏఈలు నాగలక్ష్మయ్య, కొండారెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

చాగలమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు అని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజు పుస్తకాలను చదివించడం, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్ తదితర నైపుణ్యాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మురుగు తొలగించాలి

చాగలమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భూమానగర్‌లో ఫంక్షన్‌హాల్ వద్ద నిలిచిన మురుగు నీటిని తొలగించాలని మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం ఆందోళన చేపట్టారు. మురుగునీరంతా కాలువ వెంట ప్రవహించి నీటి కుంటగా మారిందని, దీంతో దోమలు అధికమై వ్యాధుల బారీన పడుతున్నామని మహిళలు వాపోయారు. పంచాయతీ అధికారులకు సమస్యను పరిష్కరించాలని వినతి రూపంలో అందజేసిన పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

డోన్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం డోన్ ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ సమావేశ భవనంలో వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టే పనులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సౌలభ్యం కోసమే..

ప్రజల సౌలభ్యం కోసమే రేషన్ షాపుల పునఃప్రారంభించినట్లు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ అందించే కార్యక్రమాన్ని మంగళవారం డోన్ పట్టణంలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోం

నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో డోన్ నియోజకవర్గంలో తాగు, సాగునీరుకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామన్నారు. రెండు నెలల్లో ఇంటింటికి మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెన్నుపోటు దినం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచిన జగన్ రెడ్డి చరిత్ర ప్రజలకు తెలుసునని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, సీనియర్ నాయకులు మర్రి రమణ, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు



సీసీ కెమెరాలను మరమ్మతు చేస్తున్న టెక్నిషియన్లు

ఆళ్లగడ్డ జూన్ 3(ఆంధ్ర జ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని పలు కాలనీలలో పని చేయని సీసీ కెమెరాలను ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ చొరవతో టౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో మంగళవారం మరమ్మతులు చేశారు. గతనెల 13న 'ఆంధ్రజ్యోతి'లో 'నిఘా నేత్రానికి ఏమైంది' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దాంతో అధికారులు స్పందించారు. నంద్యాల నుంచి కెమెరా టెక్నిషియన్లను రప్పించి పట్టణంలోని పలు కాలనీలలో పని చేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఆళ్లగడ్డ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగందిన్నె గ్రామానికి చెందిన బండి యోనో కుటుంబ సభ్యులకు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిన్న హుసేన్‌వలి, ఉపాధ్యక్షుడు కమ్మగిరి నాగరాజు, ట్రెజరర్ శ్రీను, ఆర్గనైజర్ కిషోర్, మల్లెల వెంకటప్రసాద్, లాజర్, పాస్టర్ బాబు పాల్గొన్నారు.

రేపు మూడో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

డోన్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 5న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడవ రాష్ట్ర కౌన్సిల్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 3వ రాష్ట్ర కౌన్సిల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు కృష్ణకుమార్, చెన్నయ్య, హేమలత, విజయభారతి పాల్గొన్నారు.

రాజకీయాలు వద్దు..

- ఫ్యాక్టరీ కార్మికుల వెంట ఉండి న్యాయం చేయిస్తాం
- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ
- కార్మికుల దీక్షకు సంఘీభావం



కార్మికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు మనకొద్దు.. పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల వెంట ఉండి న్యాయం జరిగేంత వరకు తాను కృషి చేస్తానని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. మంగళవారం సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ గేటు ముందు దీక్షలు చేస్తున్న కార్మికులకు పూలమాలలు వేసి తన సంఘీభావాన్ని సుజాతమ్మ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాక్టరీ బంద్ అయితే క్వారీ ఎలా పని చేస్తుందని ప్రశ్నించారు. ఫ్యాక్టరీలో పని చేసే వారిలో కొంత మంది టీడీపీకి చెందిన వారని తొలగించడం, మరి కొంత మందిని విధుల్లోకి తీసుకోవడం వంటి రాజకీయాలు చేయడం తగదని అన్నారు. ఫ్యాక్టరీ నిలిచిపోతే క్వారీ ఎలా పని చేస్తుందని, తమ కార్మికులను తొలగిస్తూ వారితో పనులు చేయించుకోవడం తగదని అన్నారు. ఫ్యాక్టరీ పునః ప్రారంభించేలా యజమాన్యం చర్యలు తీసుకునేంతవరకు కార్మికుల వెంటే ఉండి పోరాడుతామన్నారు. అనంతరం బేతంచెర్ల టీడీపీ నాయకులు కాకర్ల తిరుమల చౌదరి ఇంటికి వెళ్లి ఆయన తండ్రి చంద్రశేఖర్ చౌదరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ కార్మికుల సంఘం నాయకులు మోజెస్, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, చంద్రశేఖర్, భీమేశ్వరరెడ్డి, జాకీర్ బేగ్, సిమెంటునగర్ గ్రామ నాయకులు రాముడు, ఉరుకుందు, కార్మికులు ఉన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

- టీడీపీ క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు



మాట్లాడుతున్న ఈటె స్వామిదాసు

డోన్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ల గౌరవ వేతనం విడుదలకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏసు కృపామందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ క్రైస్తవులకు అండగా ఉంటుందన్నారు. జూలై నుంచి నవంబరు వరకు అందాల్సిన ఏడు నెలల గౌరవ వేతనాన్ని పాస్టర్ల అకౌంటులోకి రెండు రోజుల్లో జమకానున్నాయని తెలిపారు. సమావేశంలో క్రిస్టియన్ జేఏసీ సెంట్రల్ కమిటీ పాస్టర్ దానయ్య, క్రైస్తవ సమైక్య ప్రెసిడెంట్ జాకబ్ పాల్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనందరావు, పాస్టర్ దిలీప్, ఏసురాజు, రవి, స్వర్నన్ రాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

- నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని
- బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

చాగలమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. మండలంలో హత్యాచారానికి గురైన బాధిత కుటుంబాన్ని మంగళవారం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు కల్పలతారెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు పరామర్శించారు. రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 23న నాలుగేళ్ల చిన్నారిపై హత్యాచారం బాధాకరమన్నారు. ఈ ఘటనకు కారకుడైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పాచక్రపాణిరెడ్డి, నాయకులు భూమా కిషోర్ రెడ్డి, షేక్.బాబులాల్, వీరభద్రుడు, గజ్జల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్ గోవిందయ్య పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ, మారెమ్మ జాతర



మద్దూరులో బోనాలతో ఊరేగింపు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు గ్రామంలో పెద్దమ్మ, మారెమ్మ జాతర మంగళవారం ఎస్సీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని గ్రామోత్సవంతో మారెమ్మ ఆలయానికి తరలివెళ్లి బోనాలను సమర్పించారు. మారెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా పండాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు రహంతుల్లా అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.ఆలీమ్‌కు సీఐటీయూ మండల కార్యదర్శి రహంతుల్లాతో పాటు ఆశా కార్యకర్తల కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పుష్పావతి, సుజాత, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, ధనలక్ష్మి, శాంతమ్మ, మంజుల, జ్యోతి పాల్గొన్నారు.

'ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి'

బేతంచెర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు చేసే ఆర్థిక దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బేతంచెర్లలో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కార్యక్ర మంలో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎల్లకృష్ణ, మధు, సాయితేజ, శివ, రాజవంశీ, భాస్కర్, ఫరూక్, మహేష్, విజయ్, రాకేష్ పాల్గొన్నారు.

ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

డోన్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో కేంద్రీయ విద్యాలయ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్‌కు బహిరంగ లేఖ రాశారు. డోన్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి గానూ కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్ల నోటిఫికేషన్ కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. విద్యాలయాన్ని ఏర్పాటు చేసి అడ్మిషన్ల ప్రక్రియ మొదలు పెట్టకపోవడంతో ఆందోళన నెలకొందన్నారు. కలెక్టర్ స్పందించి డోన్‌లో కేంద్రీయ విద్యాలయంలో 1 నుంచి 5వ తరగతి వరకు తరగతులు ప్రారంభించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థి, ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జనసైనికులకు అండగా జనసేన

ఉయ్యాలవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జన సైనికులకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదేకుల కోట్ల బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ క్రియాశీలక కార్యకర్తల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జనసైనికులు గోవర్ధన్, అబ్దుల్‌జిలానీ, సుజేయుడు, మల్లయ్య, సురేశ్ పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' జయప్రదం చేయండి

డోన్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 4న చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు.

'పెండేకంటి రైల్వే స్టేషన్‌గా పేరు మార్చాలి'

సంజామల,జూన్ 3(ఆంధ్రజ్యోతి): సంజామల రైల్వే స్టేషన్‌కు పెండేకంటి వెంకట సుబ్బయ్య పేరు పెట్టాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెండేకంటి కిరణ్‌కుమార్ కోరారు. మంగళవారం టీడీపీ నాయకుడు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం సహాయ మంత్రిగా, పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య పని చేశారన్నారు. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జమాళి, రసూల్, నరసింహులు, రామపుల్లయ్య పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

బేతంచెర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తబస్టాండు సమీపంలో ఉన్న రమ్య వైన్స్ షాపులో చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.3.71 లక్షలు నగదును స్వాధీన చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రమ్య వైన్స్‌లో గత నెల 25న షట్టర్ కట్‌చేసి షాపులోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదు రూ.3.99 లక్షల నగదు దొంగతనం చేశారన్నారు. సోమవారం నిందితుడు ఆలమూరు హసన్‌ను సిమెంటునగర్ కమ్యూనిటీ హాలు వద్ద అరెస్టుచేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.3,71,570 నగదు, కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడిని డోన్ కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు. కేసు ఛేదించిన కానిస్టేబుల్ సుబ్బరాయుడు, గురుబాబు, రాజు నాయక్‌ను సీఐ అభినందించారు.

వృద్ధుల ఇంటి వద్దకే రేషన్ : తహసీల్దార్

డోన్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెల డీలర్లు వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేస్తారని తహసీల్దార్ కే.నాగమణి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రతినెల 15 రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో రేషన్ అందుతుందన్నారు. డీలర్లు తూకాల్లో మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. క్రమంగా రేషన్ సరుకులు అందించాల్సిన బాధ్యత డీలర్లపైనే ఉందన్నారు.

నాగన్న మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

డోన్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన బి.నాగన్న (75) మృతి కార్మిక వర్గానికి తీరని లోటు అని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం నాగన్న భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి, వ్యాపారవేత్త పెద్ద నాగిరెడ్డి, ధర్మవరం చంద్రశేఖర్ రెడ్డి, వై.ఎల్లయ్య, జి.కొండయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, బేతంచెర్ల పట్టణ కార్యదర్శి వైబీ వెంకటేశ్వర్లు, ఏవీ సుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, రఘురామిరెడ్డి, శివరాం ఉన్నారు.

టీడీపీ సభ్యత్వం దేశానికి ఆదర్శం

డోన్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం దేశానికి ఆదర్శమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏతఈ నాగరాజు గౌడు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా టీడీపీ దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయలేని సాహసం చేసిందన్నారు. కేవలం రూ.100లు చెల్లించి సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా రూ.5లక్షలు వర్తిస్తుందన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆర్థిక భరోసా అందిస్తుందన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, వెల్దుర్తి నాయకులు ఊటకొండ చిన్నమద్దయ్య, శ్రీరాములు, ఓం.నారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.